జీవనగానం

చిట్టూరి సత్యనారాయణ



సత్యం : ఒకగీతం!

మధు : ఊహుఁ.

సత్యం : పాడవూ! బ్రతిమాలుతున్నాను.

మధు : ఊహుఁ.

సత్యం : ఏమిటీ! ఎంత సేపని అడిగేను! ఒకపాట పాడకూడదూ! కల్మషంలేని నీకెంపు పెదవులు కదిలితే: ఆ కదిలే పెదవుల్లోనుంచి సన్నటి మధురగానం వినవస్తే నాకెంత వుత్సాహం! ఎంత ఆనందం! పాడవూ మధూ.

మధు: పాడను. ఒకపాటయినా రాదు, యీ వుదయకాంతిలో పాడాలంటే నాకసలు పాటే రాదు.

సత్యం : రాదూ?

మధు : నిజంగా రాదు.

సత్యం : మరి మనవూరి పడమటికొండమీద కూర్చుని—సాయంత్రం చెట్లు పొడుగ్గా నీడలు చాపుతవి-కొండనీడ దేవాలయశిఖరంమీద పడుతుందీ, అప్పుడు మన దేవాలయపు ధ్వజస్తంభం చివరి గంటలు మందంగా జోకొడు తూంటవీ—

అప్పుడు నిన్నెవ్వరూ యీ పాట పాడు, అది పాడు అనకుండానే నీ యిష్టం వచ్చినట్లు పాడ తావు. నేను ఎప్పు డడిగినా పాడవు! ఏం.

మధు : అవును అదే చిత్రం-నేను పాడాలను కొన్నా సరే ఒక్కొక్కప్పుడు నా కే పాటా రాదు. ఎవరో బలవంతంగా నన్ను పాడనివ్వన ట్లుంటుంది.

సత్యం : అయితే కాని మధూ! నీ కన్ని పాటలు అంత శ్రావ్యంగా ఎలా వస్తాయి! నీ కెవరు నేర్పుతారు?

మధు : నా కెవరు నేర్పుతారు? నా కెవరి తోనూ మాట్లాడాలని వుండదు అసలు. ఊరికే ఏవో ఆలోచిస్తూ, నీ పెదవులమీది మందహాసం నీ చెక్కిళ్ళ నునుపు ఎప్పుడూ చూస్తూవుండాలని వుంటుంది. ఇంకా నీ కళ్ళలోని తేజస్సు ఎప్పుడూ నాకోసం వెతుక్కున్నట్లు భావించుకొంటే ఎంతో బాగుంటుంది. అవును కాని, నీ పెదవుల మీది నిరంతర మందహాసం నీ కెవరిచ్చారు?

సత్యం : ఎవరిచ్చారో చెప్పనా ? ఎవరో?- ఎవరో ?- నీకు అన్ని పాటలు ఎవరు నేర్పారో వారు ! నిన్ను రోజూరోజూ ఉదయమనక సాయంత్రమనక ఎప్పుడూ నాదగ్గరకి ఎవరు పంపుతారో వారు !

మధు : కానీ సత్యం ! ఒక్కొకపుడు నీ పాదాలు నా హృదయానికి హత్తుకోవా లను కుంటాను. జన్మజన్మలకీ నీకు కృతజ్ఞురాలనుగా వుండాలి అనుకుంటాను. నీకు 'మధు' అంటే జన్మలకీ అలాంటి సంబంధం యిష్టమే ?

సత్యం : ఇష్టంకదూ! మధూ! ఇష్టం! ఇష్టం! ఇష్టంకంటె ఎక్కువైన యిష్టం !-

మధు : నేను స్వర్గంలోవున్నా యింత ఆనందం పొందివుండను. నీ సముఖంలో స్వర్గం అనుభవిస్తున్నా. రా- దగ్గరగా రా- సత్యం- పాట కతీతమైన ఆనందం, సౌఖ్యం పొందు తున్నా నిప్పుడు. ఇప్పుడు ఏపాట పాడినా వెలితిగానే కనబడుతుంది నాకు. నీ ప్రేమ అనే గానంలో మునిగిపోతున్నా !

సత్యం : ఇంత సుందరమైన బుజాలను వూహించుకోనయినా లేదు. ఎందుకు నాకు పాటలు ?

మధు : నీ విశాలమైన వక్షస్థలానికి నా శిరస్సు చేరుస్తున్నాను.

సత్యం : లభ్యంకాని నీ శిరస్సూ, అసమాన మైన నీ నేత్రాలు, సాటిలేని నీ బుజాలు వరు సగా ముద్దులతో- అభిషేకం చేస్తున్నాను.

మధు : అణచరాని, అర్థంగాని ఒక శక్తి నీతో హత్తుకుపొమ్మని చెపుతూంది నాకు. సత్యం ! యింకా గట్టిగా నలిపివెయ్యి నీ కౌగిలిలో-

సత్యం : (అరమూతలు పడ్డ 'మధు' పెద వులపై ముద్దుపెట్టుకుంటు) మధూ!నువ్వే నేను ! నేనే నువ్వు!

[తెర]

౨

మధు : నీలో కలసిపోయాను.

సత్యం : నీలో కలసిపోయాను.

మధు :

పొడుపుకొండపై
మిల మిల మెరిసే
అరుణకాంతిలో
జీవకళలలా
మెరిసిపోదాములే !
కడలిగర్భమున
వినీలకాంతిలా
కలసిపోదాములే!

సత్య : నిర్మల గంగా ప్రవాహినిలాగుంది నీ వాక్కు.

మధు : గంభీరమైన కడలికీ నీకూ సామ్యం వుంది.

సత్యం : ఏ తృష్ణా ఏ కాంక్షా లేకుండా నీ కంకితం చేసుకున్నాను జీవితం.

మధు : ఏ పూర్వపుణ్యంవల్లనో నీలోనికి చేర్చుకున్నావు.

సత్యం : నాకు కావలసినది ఏమీ లేదిక—నీతో ఆకాశ వీధిలోని కెగిరిపోవటం తప్ప.

మధు : అమృతంచేత పునర్జీవి తైనట్లు న్నది, నీ మాటలు వింటూంటే!

సత్యం : విశ్వంలో, ప్రేమలో, అగ్నిలో ఆహుతిలో, ఆకాశములో తేజస్సులో గోచ

శించే గంభీరత నీకండ్లలోనూ కనబడుతూంది యిప్పుడు-

మధు : కళాశిల్పివైన నిన్ను నా తలపులలో మగ్నముచేసి, నా హృదయ సింహాసనమున నధిష్ఠితునిచేసి, నా కన్నులలో నింపుకున్నాను. అదే వాటి తేజస్సు.

సత్యం : సత్యమును పెనవేసికొన్న నీ జీవితమును చుట్టివేసి నిన్నలము కొంటాను.

మధు : తల్లి 'పాప'ను కౌగిలించినట్లు.

3

మధు : ఎవరు నీవు!

సత్యం : నీ వెరుగవా ?

మధు : ప్రేమవిహంగము రెక్కలు చప్పుడు చేయకుండా ఆకాశంనుండి దిగివచ్చినపుడు——నువ్వు దానిపైనెక్కి వచ్చావా? అప్పుడు నాకు కనపడలేదేం ! నువ్వా ! నిన్ను నేనెరుగుదును. నేను పుట్టినప్పటినుండీ ఎరుగుదును. అంతేకాదు- అది సరికాదు- జన్మాంతరముల నుండీ ఎరుగుదును.

సత్యం : తెలుసుండీ ప్రశ్నలం వేసేవారి కెవరు చెపుతారు ?

మధు : ఎవ్వరూ చెప్పరా ?

సత్యం : చెపుతారా ?

మధు : ఏమో ! ఎందుకు చెప్పకూడదు ? విశ్వంలో నాకు తెలిసిన ప్రతి సుందరవస్తువునూ మళ్ళీ మళ్ళీ ప్రశ్నిస్తాను- మళ్ళీ మళ్ళీ సమాధానం పొందుతాను.

సత్యం : నేనూ సుందరవస్తువులలోని ఒక వస్తువునా ?

మధు : కాకేమి ?- నీ సౌందర్యము నన్ను హత్తుకొంటున్నది. చిన్నతనపు చిలిపి చేష్టలు వదలుతూన్న కురంగరాజు విహరించేటప్పటి సౌందర్యమును జ్ఞప్తికితెచ్చే నువ్వు——

సత్యం : ఆగు !

మధు : ఎందుకు? ఎందుకు నీకా సౌందర్యం? ఎందుకు నాకీ లేనిపోని కలత ! ఏమీ లేద బ్బాయి ! ఏమీలేదు! నువ్వే సౌందర్యానివి- చిత్రకళవి- సంగీతానివి- అన్నీ. విశ్వంలోని సమస్త సంతోషమూ, కాంతీ- మరి విజ్ఞానమూ-

సత్యం : అన్నీ నువ్వే-

మధు : నువ్వు సత్యం, సుందరం-

సత్యం : నువ్వు సత్యంకంటె- సుందరంకంటె మధురమైన 'మధు'.

మధు : సత్యం !-

సత్యం : మధూ! నా హృదయం - హృదయంలోని సౌహార్దం.

మధు : నేనాస్థానానికి తగుదునా సత్యం! చెప్పు. ఆవేశంతో- కాంక్షతో-ఆశతో వుండే యీ నేను ఆ స్థానానికి ఎట్లా అర్హత సంపాదించుకొనేది? సత్యం! నిజంగా నన్నుకూడా- పట్టిమనిషిని 'నిర్మలం' చేసివేసే-అచంచలమైన ప్రేమతో నింపేశావు.

సత్యం : నువ్వే—

మధు : కాదు సత్యం! కాదు. నువ్వేచేశా వీ పని-యీ ప్రపంచంలో ఎవ్వరూ చేయలేని ఆ పని చేశావు. అదే చూడు-నేను పట్టి ఆశతో పాపలా నీవొళ్ళో నిదురపోవాలి అనుకుంటాను. నీ కళ్ళూ, అనంతమైన నీ మనసూ యింకేమీ దర్శించకుండా నాలోనే నిల్చుకోవాలి అనుకుంటూ దురాశతో నిద్రపోతాను. విశ్వమంతా ఆలముకొని రక్షించే నీ విశాలభావంలో ఏ మూల యిముడగలను?

సత్యం : అదేదో చిత్రం! నువ్వలాగంటావు. నువ్వంటున్నదేమో? అయినా-నిజమే, ఒక్కొకపు డనుకుంటాను నువ్వు లేనపుడు 'నేను విశ్వమే అయిపోదామని'-కాని అది సాధ్యమా- ధవళమై జ్వలించే చంద్రుని చూపులోనూ, ధగ ధగా వెలిగే సూర్యుని తీక్ష్ణతలోనూ వుండే భావమే నీలోనూ చూస్తాను. ఎందుకూ-అంత ఆ వేదనతో అట్లా కుమిలిపోతావు?

మధు : చల్లనైన నీలోని అమృతం తాగి సుఖించేందుకు.

సత్యం : పాపాయి కన్నిమాటలు వచ్చును- కాని ఎందుకంత ముగ్ధగా వుంటాడు?

మధు : అమ్మ మాటలు అమ్మ నోటితో నేర్పితే నేర్చుకోవాలని.

సత్యం : నువ్వూ అంతే!

మధు : నేనూ అంతే——

సత్యం : ఏం-ఎందు కలా అయినావు-నీవు 'పాపాయి'వే. నేను అమ్మనా? అదే సందేహం-

నేనే-అ మాతృత్వానికి తగిన-ఓ-ఆశక్తే నా కుంటేనా?

మధు: లేదూ? ఉంది, సత్యం. సమస్త శక్తులూ కలిపి నిన్ను చేశారు దేవతలు. భూమి మీద-అదృష్టవంతుల కమృతంలా-నా కిచ్చారు. ఎవరో యిచ్చేశారు, నిన్ను నా కిచ్చేశారు.

సత్యం: ఏమో! మధూ! ఎంత చిత్రంగా మాట్లాడుతావు! నిన్ను మొదటచూచినప్పటి నుంచీ ఏదో జ్ఞప్తికి వస్తూంది నాకు. స్పష్టము కాని ఏదో భావము - అప్పటినుంచీ కలత పెడు తూంది. మధూ! మిత్రులతో, బంధువులతో - లోకంతో పోల్చి చూదామనుకుంటాను నిన్ను- నాకు సాధ్యంకాదు. శిల్పి సృష్టించే బొమ్మనూ, కవి నిర్మించే మహా గీతాన్నీ దాటి పోయావు. దేవీ! అమూల్యమగు నీ సౌందర్యమునకు, అపూర్వ మగు నీ సౌహార్దమునకు ఏదో కొరత ఉన్నట్లు యీ భయంకరభావము - పిశాచిలా నన్ను వెన్నాడుతుంది. మనః పరిపక్వములేని నావూ మాతో నీ గుణరత్నరాశిని విభాగించటం సాహ సమే! .ను - ఖిన్నపడకు, నిజమో ఏమో - తోచినప్పుడు చెప్పుకోవద్దూ? పోనీ వెళ్ళి పోదామా?

మధు: వద్దు!

సత్యం: చల్లని వెన్నెలలో చిన్నమబ్బులు లెక్కపెడుతూ ఆడుకొందమా?

మధు: ఊఁ హుఁ.

సత్యం: నా ఒళ్లో పడుకో నిచ్చేదా?

మధు: ఊఁ.

సత్యం: రా-యిట్లా దగ్గరగారా యిక్కడకు. వీణ వాయించడం జ్ఞప్తికితెచ్చే నీవ్రేళ్లు ఎంత అందంగా ఉంటాయి మధూ!

మధు. చెప్పు! స్వస్థచిత్తంతో వింటాను. ఇప్పుడు మాట్లాడు. నీ నోటినుండివచ్చే ప్రతి మాట - యీ హృదయకోశంలో దాచుకోవా లనీ! - నీ దగ్గరేవుంటే ఏమీ భయంలేకుండగా దాచుకోవచ్చును. అవునా?

సత్యం: ఊఁ హూఁ!

మధు: నవ్వుతావేం?

సత్య: మధూ! ప్రేమంటే ఏమిటి చెప్పు?

మధు: చెప్పనా, (సత్యం పెదవి ముద్దుపెట్టు కుని) యిది.

సత్యం: అది ముద్దు.

మధు: ముద్దూ ప్రేమా ఒకటే!

సత్యం: ఒకటే! ఒకటా - ఏమో?

మధు: ఒకటే, చూడు - నువ్వు గాఢంగా, మధురంగా యీవత్సం నీ పెదవులతో తాకినపుడు గులాబీపూవులతో ఒత్తినట్లుంటుంది. ఆనందంతో సోలిపోయి కళ్లుతేలవేసి - అమరత్వంపొందే - అట్లాంటి ప్రేమకదూ! ఇది ప్రేమే - కాదనకు సత్యం! ఇది ప్రేమే.

సత్యం: కాదనటం లేదు.

మధు: ఇంక నిద్రపోదాం -

సత్యం: ఊఁ

(తెర)

మధు: నిన్ను చూస్తేనే నాకు చాలు. పొంగిపోగలను. నీవెందుకలా కలవరపడతావు? నిద్రలోలేచి ప్రశాంతంగా నిద్రించే నీ ముఖం చూస్తునుగదా- చూస్తున్నకొద్దీ- ఆ శాంతిలో ఏదో -అసంతృప్తి-ఊఁ హుఁ అదేదో కళ్లో లంలా అగుపడుతుంది. నేనప్పుడు భగ్నమై- భయంతో వణకిపోయి నిన్నే కావిలించుకు- పడుకోబోతాను. నిర్మలమైన రాత్రివేళల యిట్లా ఎన్నిసార్లు నిద్రాభంగం చేశానో?

సత్యం: అదేదో అలవికాని అసంతృప్తి మనల్ని వెన్నాడి చంపుతోంది.

మధు: అసంతృప్తీ? నాకలావుండదు. కాని ఏదో పతనమైపోతున్నట్లుంటుంది. అదేదో నాకు తెలియదు. ఏం- అట్లా అయిపోతున్నావేం? ఎందుకూ? వీణవాయించనా? నాపాట శ్రుతితో కలిపి పాడేదా?-

సత్యం: ఇప్పుడువద్దు మధూ? యీసుందర గానం- యీ విశాలావనిలోని సౌందర్యం నాకు కాదు.

మధు: ఏం సత్యం! అట్లా అయిపోతావు?

సత్యం: అవునుకానిమధూ!—మనం పడు కొనేది ఎక్కడ?

మధు: మేడమీద- యీ గదిలో— యీ తల్పంమీద.

సత్యం: చెబుతున్నా విను. నేను స్వయంగా చూచాను, చెట్లకింద పడుకునేవాళ్ళని. వాళ్ళలా నేనూ-

మధు : (ఆశ్చర్యపడుతుంది)

సత్య : అసలనుకునేవాడిని వాళ్ళలావుందా మని. కాని ఆలోచిస్తే తెలిసింది వాళ్లూ నువ్వూ నేనూ యింతకంటె యింకోవిధంగా బతకవచ్చునని. అట్లా ఆశ్చర్యపోతావేం? వాళ్ళకీ మనకూ సమానమైన సుఖంగావుండే యిళ్లు కట్టుకో వచ్చును.

మధు : మరి ధనం క్కావాలి?

సత్యం : మన కింత ఎందుకు?

మధు : అంటే?

సత్యం : ఓముగ్ధాదేవీ! అంటే ఏమీలేదు. మనం- అంటే నీవూ నేనూ, బీదలూ, కార్మికులూ కర్షకులూ అంతా మనుష్యులమేనా?

మధు : ఆ——

సత్యం : అందరం గాలి పీలుస్తున్నామా? నీరు త్రాగుతున్నామా?

మధు : గాలి పీలుస్తున్నాం-నీరు త్రాగుతున్నాం-భోజనం చేస్తున్నాం!

సత్యం : లేదు! అది లేదు. భోజనం చేయటంలేదు. కొందరు భోజనం చేయటంలేదు. చేయటానికి తిండి ఏదీ-లేదు-వాళ్ళకి దొరకనివ్వటంలేదు. దొరికితే గాలిలా నీళ్లలా వాడుకొనేవారే-కాని వాళ్లకి తిండిని కొందరు ఎందుకో దొరకనివ్వరు!

మధు : మరి వాళ్లెలా బతుకుతున్నారు-ఓ, ధర్మంవల్ల-ఔనా?

సత్యం : ధర్మం-ఏం ధర్మం-వాళ్లు బతకటం లేదు. వాళ్లు బతికేటంత ధర్మ మెవ్వరూ యివ్వరు.

మధు : మరి?

సత్యం : ఏమీలేదు - వాళ్లు చావటానికి మాత్రమే పుట్టారు. వాళ్లు చస్తున్నారు. ఈ ధని కుని-యీ దురాశాపరుని అర్జునాహోమంలోనే వాళ్ల జీవితాలు లయం!

మధు : అంటే?——

సత్యం : అంటేనా? అవసరము లేనంత ధనము పోగుచేసికొని కొన్ని అధర్మ సూత్రాలతో దానిని బంధించి ఆడిస్తున్నారు-కొందరు. ఈ భూదేవి తమ స్వంతం అని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు.

మధు : అసలది వాళ్ళదా?

సత్యం : వాళ్ళదీ కాదు-వీళ్ళదీ కాదు-అందరి దీని. ఆ భావమే నశించింది అందరిలోనూ.

మధు : అందు కేం చేయాలి?

సత్యం : అందుకేం చేయాలి?——అదే-అదే విషయం రాత్రింబగళ్లు తలపోసినా తీరని సమస్య. నాకూ-నా దుఃఖానికీ, తీరని ఆ వేదనకూ యిదే మూలం. ఎప్పుడో ఓరోజు వస్తుంది-ఆనాడు అన్నీ చక్క నవుతవి అనుకుంటూ-ఎన్నోనాళ్లు వృథాచేశాం. ఇప్పుడెంతో శీఘ్రంగా చేయాలి ఎన్నో పనులు. మొదట మనం వీటిని వదలివేయాలి.

మధు : అవును సత్యం! వదలివేయాలి-ఇదిగో వదిలేస్తున్నాను. ఈ రోజునుంచీ నాకీ ఆభరణాలేమీ అక్కరలేదు. సామాన్యమైన దుస్తులు తప్ప నాకేమీ అవసరం లేదు-సామాన్యమైన ఆహారంకంటె ఎక్కువ ఏమీ తినను. ఇదిగో - హృదయంతో కోరుకుంటున్నాను- నన్నాశీర్వదించు. నీ అడుగుచాయలలో రానీ- నేనూ యీ విశ్వసేవలో మగ్నమై పోతాను. ఏ అజ్ఞాతసీమలకైనా పోతాను- ఈ సేవే నీవు-సత్యం!

సత్యం : దేవీ! పోతున్నాము. ఇదే మొదలు- ప్రయాణము సాగిద్దాము విశ్వసేవలో యిద్దర మూను.

మధు : అవును మహాకవీ! అవును జ్ఞప్తికి వస్తున్నవి. ఆనాటి పాటలు అవి నిజమై పోతున్నవి.

జాగుసేయక దేవి లేచిరావమ్మ
ఆతల్లి సేవకై పోవాలి మనము.
సస్యశ్యామలవర్ణ వస్త్రముందాల్చి
కాంతులు కురిపించు తిలకంబు దిద్ది
దివ్యతేజస్వినీ వెడలిపోవాలి
జాగుసేయక దేవి లేచిరావమ్మ!

[తెర]

(తరువాయి వచ్చే సంచికలో)